GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 111 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 25 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఈ పార్లమెంట్ సమావేశాలు ఎంతో కీలకం: ప్రధాని మోదీ

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా నిర్మాణాత్మక చర్చలు జరగాలని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు.

దిల్లీ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు. "ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం" అని మోదీ మీడియాతో మాట్లాడారు. "ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరు" అని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. "ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నాను" అని మోదీ అన్నారు.

బంగాళాఖాతంలో వాయుగుండం.. ఏపీలో రెండు రోజులు వర్షాలు

దక్షిణ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం.. 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారేందుకు అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది.

విశాఖ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): దక్షిణ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం.. 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో దక్షిణకోస్తా, ఉత్తరకోస్తాలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 28, 29న నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తాలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని.. ఇప్పటికే కోస్తాంధ్రలో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఉత్తర కోస్తా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు.. విజయపాల్‌కు ఎదురుదెబ్బ

అమరావతి, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజప్పాల్కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని ఆయన పిటిషన్ వేయగా.. నేడు విచారణ జరిగింది. సుదీర్ఘ వాదనల అనంతరం జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలే ధర్మాసనం పిటిషన్ను కొట్టివేసింది. వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో విజయ్పాల్ నిందితుడిగా ఉన్నారు.

వంద శాతం సోలార్ విద్యుత్ సరఫరా.. పైలట్ ప్రాజెక్టుగా కుప్పం ఎంపిక

విద్యుత్ శాఖపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

అమరావతి, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): విద్యుత్ శాఖపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించే విషయంలో చేపట్టిన కార్యక్రమంపై సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. పీఎం సూర్య ఘర్, ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ పరికరాల ఏర్పాటుపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారి గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటుపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు చేశారు. కుసుమ్ పథకం, సోలార్ విలేజ్ అంశాలపైనా సీఎం చర్చించారు. 100 శాతం సోలార్ విద్యుత్ సరఫరాకు కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది.

అదానీ రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నాం :సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

అదానీ వ్యవహారంలో గత కొన్ని రోజులుగా దుమారం కొనసాగుతోన్న వేళ తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): అదానీ గ్రూప్పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు.

నేనేం రాజీనామా చేయలేదు.. ఆ వార్తలు నిజం కాదు: నానా పటోలే

తాను రాజీనామా చేశానంటూ వచ్చిన వార్తలను కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర చీఫ్ నానా పటోలే ఖండించారు.

ముంబయి, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిరాజనక ఫలితాలు పొందింది. దానికి బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ మహారాష్ట్ర చీఫ్ నానా పటోలే రాజీనామా చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే అవి నిజం కాదంటూ స్వయంగా ఆయనే స్పందించారు. తాను రాజీనామా చేయలేదని వెల్లడించారు.

అలాగే మహా వికాస్ అఘాడీ చెక్కుచెదరకుండా ఉందని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అసెంబ్లీలో 288 సీట్లు ఉండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 51 చోట్ల గెలుపొందింది. కూటమిలో భాగంగా 101 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం 16 స్థానాలు మాత్రమే గెలుచుకోవడంతో పార్టీకి పెద్ద ఎదురుదెబ్బే తగిలింది. మహారాష్ట్ర ఏర్పడిన నాటినుంచి ఎన్నడూ లేనంత బలహీనంగా కాంగ్రెస్ మారిపోయింది. 2014లో పార్టీపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు.. మోదీ హవాతో మహారాష్ట్రలో కాంగ్రెస్ తీవ్రంగా దెబ్బతింది. అప్పట్లో కేవలం 42 సీట్లు మాత్రమే సాధించింది. నాటినుంచి మళ్లీ కోలుకోలేదు. తాజా ఎన్నికల్లో పాతిక స్థానాలు కూడా సాధించలేకపోయింది. కొన్ని వర్గాలపై అధికంగా ఆధారపడటం, పార్టీ నేతలు ప్రజల్లోకి వెళ్లకపోవడం... తదితర అంశాలతో పార్టీ ప్రజాదరణను కోల్పోతోందని రాజకీయ నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేశారు. 2021లో నానా పటోలే మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్సభ ఎన్నికల్లో.. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పోటీ చేసిన 17 స్థానాలకు గాను 13 స్థానాలను గెలుచుకొని, అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సాకోలీ స్థానం నుంచి 208 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

కామారెడ్డి డిక్లరేషన్ను యథాతథంగా అమలు చేయాలి :ఎమ్మెల్సీ కవిత

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

హైదరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక బీసీ సంఘాలు, మేధావులు ఇచ్చిన సూచనలు అమలుకు నోచుకోలేదన్నారు. హైదరాబాద్లో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బుసాని వెంకటేశ్వరరావుకు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు తాత్సారం చేసింది. డెడికేటెడ్ కమిటీ స్వతంత్రంగా పనిచేయాలి. ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పనిచేస్తుంది? కులగణనపై నెల రోజుల్లో నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి చట్టబద్ధత కల్పించాలి. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. హైదరాబాద్లో ఇప్పటికీ 70 శాతం స్టిక్కర్ వేయని

ఇళ్లు ఉన్నాయి. 90 శాతం సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెబుతోంది. డేటా కంప్యూటరీకరణ చేశారా?" అని కవిత ప్రశ్నించారు.

సచివాలయ ఉద్యోగి సూసైడ్

నంద్యాల క్రైం, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం జి.జమ్ములదిన్నెలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న హరినాథ రెడ్డి సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కూతురు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు

ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన రద్దయింది. ఏపీలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 29న జరగాల్సిన ఆయన పర్యటన రద్దయినట్లు పీఎంవో తెలిపింది.



దిల్లీ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన రద్దయింది. ఏపీలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 29న జరగాల్సిన ఆయన పర్యటన రద్దయినట్లు పీఎంవో తెలిపింది. మోదీ పర్యటన నేపథ్యంలో విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా అనకాపల్లి పూడిమడకలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనతో పాటు కొన్ని రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులను జాతికి అంకితం చేయాల్సి ఉంది. కానీ, తుపాను ప్రభావం నేపథ్యంలో ఆయన పర్యటన రద్దయినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

ప్రత్యేక ప్రతిపత్తిని అంబేడ్కర్ వ్యతిరేకించారు: న్యాయశాఖ మంత్రి

జమ్మూకశ్మీరు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడాన్ని డా. బీఆర్ అంబేడ్కర్ వ్యతిరేకించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ పేర్కొన్నారు.

దిల్లీ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డా. బీఆర్ అంబేడ్కర్, జమ్మూకశ్మీర్కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడాన్ని వ్యతిరేకించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు అది విరుద్ధమని ఆయన భావించారని చెప్పారు. జమ్మూకశ్మీర్కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని అంబేడ్కర్ లేనప్పుడు రాజ్యాంగ పరిషత్తు హడావుడిగా ఆమోదించిందన్నారు. "విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం' పేరుతో దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ఈ విధంగా మాట్లాడారు. "రాజ్యాంగ పరిషత్తు ముందుకు వచ్చిన అన్ని అంశాలపై తొలుత మాట్లాడింది అంబేడ్కర్. నిత్యం అనేక గంటలపాటు లేదా ఒక్కోసారి రోజు మొత్తం దీనిపై చర్చలు జరిగేవి. ఈ చర్చలకు అంబేడ్కర్ సమాధానాలు ఇచ్చేవారు. డిబేట్లలో ఆయనే ఎక్కువగా మాట్లాడినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ, ఆర్టికల్ 370ని మాత్రం ఆయన వ్యతిరేకించారు" అని అర్జున్ రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు. అయితే, దీనిని ఆమోదించాలని జవహర్లాల్ నెహ్రూ పట్టుబట్టారని, ముసాయిదా

కమిటీలోని మరో సభ్యుడికి దీని ఆమోదం బాధ్యత అప్పగించారని అన్నారు. ఆమోదం తెలిపే సమయంలో అంబేడ్కర్ అక్కడ లేరని, ఆసుపత్రికి వెళ్లారని అన్నారు. బీఆర్ అంబేడ్కర్ నిజమైన దేశభక్తుడని కేంద్ర మంత్రి కొనియాడారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

జీహెచ్ఎంసీలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులు రద్దు చేసిన సుప్రీంకోర్టు

జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

దిల్లీ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టుల సొసైటీలకు గతంలో ప్రభుత్వాలు భూకేటాయింపులు చేశాయి. వీటిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈక్రమంలో విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కో హామీ నెరవేరుస్తున్నాం: మంత్రి పొన్నం

మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్రావు సంబర పడుతున్నారా? భాజపా గెలిచిందని సంతోషపడుతున్నారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

హుజూరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్రావు సంబర పడుతున్నారా? భాజపా గెలిచిందని సంతోషపడుతున్నారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. "తెరాసను భారసగా పేరు మార్చారు. మహారాష్ట్రకు వందల కార్లలో వెళ్లి కనీసం పోటీ కూడా చేయలేకపోయారు. మేం మొదటి నుంచీ చెబుతున్నాం. భారాస, భాజపా దిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నాయి. ఇది మ-రోసారి నిరూపణ అయింది. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. ప్రతిదీ రాజకీయంగా ఆలోచిస్తే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం. మొన్నటి వరకు పంట మొత్తం కాళేశ్వరం వల్లే అన్నారు. కాళేశ్వరం లేకున్నా ఎల్లంపల్లి నుంచి పొదుపుగా నీరు వాడుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కూడా రాని పంట ఇప్పుడు వచ్చింది.. ప్రకృతి సహకరించింది. రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని రైస్ మిల్లర్లకు చెప్పాం. ఇంకా ఎవరైనా ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి బకాయిలు చెల్లించాలి. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం అయినందుకు కల్లాల వద్దకు వచ్చి ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిన మాట్లాడారు. సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇస్తున్నాం.. రాష్ట్రంలో ఎవరికైనా రాకపోతే చెప్పాలి. మాట మీద నిలబడి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశాం. ఎవరికైనా రుణమాఫీ కాకపోతే వ్యవసాయ అధికారుల ద్వారా కుటుంబ నిర్ధరణ జరుగుతోంది. ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది. వారికి కూడా తప్పకుండా రు-ణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదే. ప్రజా పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు స్వేచ్ఛగా కలవగలుగుతున్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉంది. అయినా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఒక్కో హామీని నెరవేరుస్తున్నాం. ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే జీతాలు వస్తున్నాయి. 11 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. గత పదేళ్లలో భాజపా, భారాస ఏం చేసిందో ప్రజలు గమనించాలి"అని మంత్రి పొన్నం అన్నారు.

చెవిరెడ్డీ.. నాకు చెప్పేవాడేనా!..

బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ బాలినేని సవాల్

తాను విలువలతో రాజకీయాలు చేసే వ్యక్తినని జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.

హైదరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): తాను విలువలతో రాజకీయాలు చేసే వ్యక్తినని జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్రెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టినట్లు జనసేనలో చేరినప్పుడే చెప్పానని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్మెప్పు కోసమే తాను మాట్లాడుతున్నట్లు వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సై అభిమానంతో ఆయన మరణం తర్వాత మంత్రి, ఎమ్మెల్యే పదవులు వదులుకొని వైకాపాలోకి వెళ్లానని బాలినేని గుర్తుచేశారు. రాజశేఖర్రెడ్డి కుటుంబమంటే జగన్ ఒక్కరేనా? విజయమ్మ, షర్మిల కాదా అని ప్రశ్నించారు. వారిపై అసభ్య పోస్టులు పెడితే ఆ కుటుంబం కానట్లు పట్టించుకోరా? అని బాలినేని నిలదీశారు. తాను ఎవరి మెప్పు కోసం పనిచేయడం లేదని.. ఈవిషయాన్ని చెవిరెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. తిట్టిన వాళ్లకే టికెట్లు ఇస్తామనే సంప్రదాయం ఎవరు కొనసాగిస్తున్నారో తెలుసని వ్యాఖ్యానించారు. "ఎవరినీ విమర్శించను అని చెప్పా.. అలా చేస్తే నేను కూడా వాస్తవాలు చెప్పాల్సి వస్తుంది. అదానీతో విద్యుత్ ఒప్పందాల్లో రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో విద్యుత్ మంత్రిగా ఉన్నందున ఏం జరిగిందో చెప్పాను. సెకీతో ఒప్పందం అంశంలో నాకు ఏమాత్రం సంబంధం లేదు. సీఎండీ ఫైల్ కూడా నా వద్దకు రాలేదు. చెవిరెడ్డి భాస్కర్రెడ్డికి ఏం తెలుసని మాట్లాడుతున్నారు. నేను వ్యక్తిగత విమర్శలు చేస్తే ఎవరూ తట్టుకోలేరు. పవన్ వెంట ఉంటూ కూటమితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిని తీసుకొచ్చి ఒంగోలులో టికెట్ ఇస్తారా? అలా చేయడం నాకు నచ్చలేదు. అందుకే దానికి అంగీకరించలేదు. వైకాపా నుంచి ఎందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిందో మొత్తం చెబుతా. ధైర్యం ఉంటే చెవిరెడ్డి బహిరంగ చర్చకు రావాలి" అని బాలినేని సవాల్ విసిరారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటన..

విచారణ ముమ్మరం చేసిన సిట్

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై సిట్ విచారణ కొనసాగుతోంది.

ఈమేరకు తిరుమలలో రెండు రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై సిట్ విచారణ సాగుతోంది. ఈమేరకు తిరుమలలో రెండు రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులతో కలిసి ఇటీవల సిట్ ఏర్పాటుచేశారు. సీబీఐ అధికారుల పర్యవేక్షణలో ఈ విచారణ సాగుతోంది. మూడు బృందాలుగా ఏర్పడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడు దిండిగల్ ఏఆర్ డెయిరీలో సిట్ బృందం సభ్యులు వివరాలు సేకరించారు. తిరుపతిలోని తితిదే మార్కెటింగ్ గోదాములను పరిశీలించారు. నెయ్యి కొనుగోలు టెండర్ల దస్త్రాలపై ఆరా తీశారు. తిరుపతి తూర్పు

పోలీసుస్టేషన్లో నమోదైన కేసు ఆధారంగా సిట్ విచారణ సాగుతోంది.

అదానీ రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నాం: సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

అదానీ వ్యవహారంలో గత కొన్ని రోజులుగా దుమారం కొనసాగుతోన్న వేళ తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): అదానీ గ్రూప్పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు.

అనవసర వివాదాల్లోకి ప్రభుత్వాన్ని లాగొద్దు

"అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్పకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు" అని సీఎం అన్నారు.

అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తాం

"నేటి దిల్లీ పర్యటనకు రాజకీయాలతో సంబంధంలేదు. లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే దిల్లీకి వెళ్తున్నాం. పార్లమెంటు సమావేశాలపై ఎంపీలతో మంగళవారం చర్చిస్తాం. అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులను రేపు కలిసి రాష్ట్ర సమస్యల్ని వివరిస్తాం. 28 సార్లు దిల్లీ వెళ్లానని కొందరు విమర్శిస్తున్నారు. నేను వారిలా పైరవీలు చేయడానికో.. బెయిల్ కోసం దిల్లీకి వెళ్లలేదు. కేంద్రం నుంచి మనకు రావాల్సినవి రాబట్టుకోవాలి. అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తాం" అన్నారు.

జైలుకెళ్లాలని కేటీఆర్ తహతహలాడుతున్నారు..

"బీఆర్ఎస్ సర్కారు అదానీకి గతంలో ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చింది. అదానీతో బీఆర్ఎస్ సర్కారు అంటకాగింది. అదానీ వద్ద వాళ్లు కమీషన్లు తిన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని అనుకొంటున్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారు. జైలుకెళ్లినవారు సీఎం అయ్యేదుంటే ముందు కవిత అవుతారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

అర్ధరాత్రి జగన్ అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి

:సీఎం చంద్రబాబుకు షర్మిల లేఖ

అదానీతో మాజీ సీఎం జగన్ చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

అమరావతి, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): అదానీతో మాజీ సీఎం జగన్ చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె లేఖ రాశారు. "అదానీతో ఒప్పందం రాష్ట్రానికి పెను భారం. అక్రమ డీల్ కారణంగా పాతికేళ్లపాటు ప్రజలపై రూ. లక్షన్నర కోట్ల భారం పడుతుంది. అర్ధరాత్రి అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి. ఒప్పందాలను రద్దు చేసి, ఆ కంపెనీని వెంటనే బ్లాక్ లిస్టో పెట్టాలి. ఒప్పందాలపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. గంగవరం పోర్టును అదానీకి అప్పగించడంపైనా విచారణ జరగాలి" అని లేఖలో షర్మిల పేర్కొన్నారు.

కొడంగల్ రైతుల బాధలు వినే ఓపిక, తీరిక సీఎంకు లేవు: కేటీఆర్

తెలంగాణ ఉద్యమంలో మానుకోటకు ప్రత్యేక స్థానం ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

మహబూబాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ఉద్యమంలో మానుకోటకు ప్రత్యేక స్థానం ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. లగచర్ల బాధితులకు మద్దతుగా మహబూబాబాద్ లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త నియంత రేవంత్కు మానుకోట ధర్నా బుద్ధి చెప్పబోతుందని విమర్శించారు. 9 నెలలుగా కొడంగల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ రైతులు తిరగబడ్డారని చెప్పారు. మూడు వేల ఎకరాలు గుంజుకోవాలని సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. తమ భూములు గుంజుకోవద్దని కొడంగల్ రైతులు కోరుతున్నారని చెప్పారు. అక్కడి అన్నదాతల బాధలు వినే ఓపిక, తీరిక సీఎంకు లేవని ఎద్దేవా చేశారు. "రేవంత్ రెడ్డి 28 సార్లు ఢిల్లీ వెళ్లినా.. 28 రూపాయలు కూడా తీసుకురాలేదు. లగచర్లలో జరిగిన దాడి అధికారులపై జరిగింది కాదు. అక్కడ దాడి జరిగితే మానుకోటలో ధర్నా ఎందుకని పోలీసులు అంటున్నారు. ఎక్కడ గిరిజన, ఎస్సీ, బీసీ, బడుగు రైతులు ఉంటారో అక్కడ ధర్నా చేస్తాం. ఈ సీఎం ప్రజల కోసం పని చేయట్లేదు.. అదానీ కోసం పని చేస్తున్నారు. ఈ సీఎం తన బంధువుల కోసమే

పని చేస్తున్నారు.. ప్రజల కోసం కాదు. 6 గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు.. ఏడాది పూర్తవుతోంది.. అమలు చేశారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

పట్నం నరేందర్రెడ్డి పిటిషన్ పై హైకోర్టులో ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

హైదరాబాద్, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. లగచర్ల దాడి ఘటనలో బొంరాస్పేట పోలీసులు 3 ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని నరేందర్ రెడ్డి ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో వాదనల సందర్భంగా ఒకే సంఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఏఏజీ రజనీకాంత్ కోర్టుకు తెలిపారు. దాడి ఆధారంగా పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో.. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

అదానీతో కుమ్మక్కైన జగన్ పై చర్యలేవీ?

: బీవీ రాఘవులు

అదానీ గ్రూప్ నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై వైకాపా అధ్యక్షుడు జగన్ను ఈడీ ఎందుకు ప్రశ్నించడం లేదని సీపీఎం పాలిట్బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రశ్నించారు.

విజయవాడ, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): అదానీ గ్రూప్ నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై వైకాపా అధ్యక్షుడు జగన్ను ఈడీ ఎందుకు ప్రశ్నించడం లేదని సీపీఎం పొలిట్బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రశ్నించారు. అదానీ విద్యుత్ ఒప్పందాల్లో ముడుపుల వ్యవహారం అతి పెద్ద కుంభకోణం అన్నారు. అదానీతో జగన్ కుమ్మక్కై ప్రజలపై భారం మోపేలా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీఎం చంద్రబాబును రాఘవులు కోరారు. పార్టీ నేతలు ఎంఏ బేబీ, వి.శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐని ప్రయోగించే ప్రధాని నరేంద్ర మోదీ.. జగన్ను ఎందుకు వదిలేశారని రాఘవులు నిలదీశారు. అదానీ, జగన్ కుమ్మక్కు వ్యవహారాలపై విచారణ జరిపించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే, ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు సమావేశాల్లో చర్చించి జేపీసీతో విచారణ జరిపించాలన్నారు.

మైనార్టీలకు ద్రోహం జగన్మోహన్ రెడ్డి

రాష్ట్రం బాగుండాలని కూటమి ప్రభుత్వానికి మైనార్టీలు మద్దతు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్

నంద్యాల, నవంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): పట్టణంలో 5 వ వార్డ్ నడిగడ్డ ఫాతిమా మజీదు కమిటీ సభ్యులు ,వార్డు ప్రజలు ,నందమూరి నగర్ వార్డు ప్రజలు ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ని దుశ్శాలువతో సన్మానించి గజమాల వేసి ఘన స్వాగతం పలికారు .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీ సోదరులు ఎంతో వివక్షకు గురి అయి ముస్లిం మైనార్టీ సోదరులకు రావలసిన పథకాలు అందక సామాజికంగా ఆర్థికంగా వెనకబడి పోవడం జరిగింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనా ర్టీ సోదరులకు ఒక స్వర్ణ యుగంలా ఉండేది. ముస్లిం మైనార్టీల ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎన్నో సంక్షేమ పథకాలు, ఆడపిల్లల వివాహాలకు దుల్హన్ 50 వేలు, దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఇమాం మౌజనులకు జీతాలు, షాది ఖానాలు, ఈద్గాలు, మదర్సాల నిర్మాణం ఎన్నో పథకాలు అందేవి. మాయమాటలతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు ద్రోహం చేశారు. అది తెలుసు కున్న ముస్లిం మైనార్టీ సోదరులు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పక్షాన నిలబడి చంద్రబాబు ని ముఖ్యమంత్రిగా చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 150 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ కార్యక్ర మాలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబునాయుడు, ముస్లిం మైనార్టీల కూడా అండగా ఉంటామని భరోసానివ్వటం మా అదృష్టంగా భావి స్తూ నన్ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్నుకున్నందుకు ఆయన కు ధన్యవాదాలు తెలిపారు. .రాష్ట్రం బాగు పడాలన్నా ,అభివృద్ధి జరగాలన్న విజన్ లీడర్ చంద్రబాబు తోనే సాధ్యం అని ప్రజలందరూ నిరూపించారని అన్నారు.రాష్ట్ర భవిష్యత్తు,ప్రజలకోసం ప్రాణాలకు తెగించి పోరాటాలు చేశానని అన్నారు.రాష్ట్రంలో వైసిపి పాలనలో మైనారిటీలపై ఎక్కడ దాడులు జరిగినా వారికి మద్దతుగా నిలచానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖాజా ఫరీద్, అబ్దుల్ రషీద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఖాజా హాఫిజ్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం

చరిత్రలో నేటి ప్రత్యేకత

- అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినము
  అంతర్జాతీయ శాకాహారుల దినోత్సవం.
- 1926 : 21 వ భారత ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్ మిశ్రా జననం (మ. 2012).
- 1952 : పాకిస్థాన్ క్రికెట్ క్రీడాకారుడు ఇమ్రాన్ ఖాన్ జననం.
- 1964 : ప్రముఖ వాయులీన విద్వాంసుడు, ద్వారం వెంకటస్వామి నాయుడు మరణం (1893). (చిత్రంలో)
- 1966 : భారతీయ సినిమా నటి రూపా గంగూలీ జననం.
- 1974 : ఐక్యరాజ్య సమితి మూడవ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన యూ థాంట్ మరణం (జ.1909).
- 2010 : ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించాడు.


అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినము

అంతర్జాతీయ శాకాహారుల దినోత్సవం

రంగనాథ్ మిశ్రా

ఇమ్రాన్ ఖాన్

ద్వారం వెంకటస్వామి నాయుడు

రూపా గంగూలీ

యూ థాంట్

కిరణ్ కుమార్ రెడ్డి

టీ బ్రేక్... ఆసీస్ 8 వికెట్లు డౌన్.. రెండు అడుగుల దూరంలో భారత్ విజయం

పెర్త్ టెస్టులో భారత బౌలర్ల దెబ్బకు రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్ కకావికలమైంది. మిడిలార్డర్ ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ దూకుడుగా ఆడారు.

బోర్డర్- గావస్కర్ ట్రోఫీ ఆసీస్లో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ విజయం దిశగా సాగుతోంది. మరో రెండు వికెట్లను తీస్తే టీమిండియా గెలుపు సొంతం కానుంది. పెర్త్ టెస్టులో ఆసీస్ కు భారత్ 534 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. నాలుగో రోజు టీ బ్రేక్ సమయానికి ఆసీస్ ఎనిమిది వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. చేతిలో రెండు వికెట్లను మాత్రమే ఉంచుకున్న ఆసీస్ విజయానికి ఇంకా 307 పరుగులు చేయాలి. నాథన్ లైయన్, జోష్ హేజిల్ వుడ్ మాత్రమే బ్యాటింగ్ చేయాల్సి ఉంది.

ట్రావిస్ హెడ్ దూకుడు..

భారీ లక్ష్య ఛేదనలో 80 పరుగుల్లోపే సగం వికెట్లను కోల్పోయిన ఆసీస్ ఇన్నింగ్స్ ముందుకు సాగడంలో ట్రావిస్ హెడ్ కీలక పాత్ర పోషించాడు. ఓవైపు వికెట్లు పడినా.. దూకుడుగా ఆడినహెడ్ (89) సెంచరీ దిశగా సాగాడు. స్టీవ్ స్మిత్ (17)తో కలిసి ఆరో వికెట్కు 82 పరుగులు జోడించాడు. మిచెల్ మార్ష్ (47)తో కలిసి ఏడో వికెట్కు 22 పరుగులు జోడించిన అతడిని బుమ్రా ఔట్ చేశాడు. ఆఫ్సైడ్ వేసిన షార్ప్ బంతిని అంచనా వేయడంలో విఫలమైన హెడ్ వికెట్ కీపర్ పంత్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత మార్ష్ కాస్త దూకుడు పెంచాలని చూశాడు. కానీ, టెస్టు అరంగేట్రం చేసిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి బౌలింగ్లో బౌల్డ్ కావడంతో మార్ష్ పెవిలియన్ బాట పట్టాడు. నితీశ్కు ఇదే తొలి అంతర్జాతీయ టెస్టు వికెట్. ఈ క్రమంలో అలెక్స్ కేరీ -స్టార్క్ స్టార్క్ ఎనిమిదో వికెట్కు 45 పరుగులను జోడించారు. అయితే, సుందర్ అద్భుతమైన బంతికి స్టార్క్ (12) ఔటయ్యాడు. షార్ట్ లెగ్లో ఉన్న ధ్రువ్ జురెల్ సూపర్ క్యాచ్ను పట్టాడు.

ఓటీటీలోకి 'లక్కీ భాస్కర్'.. డేట్ ప్రకటించిన నెట్‌ఫ్లిక్స్

దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. తాజాగా ఈ సినిమా ఓటీటీలో రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది.

దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. దీపావళి కానుకగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలో విడుదల కానుంది. ఈవిషయాన్ని తెలియజేస్తూ ఓటీటీ సంస్థ నెటిక్స్ తాజాగా పోస్ట్ పెట్టింది. నవంబర్ 28 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఇది ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుంది.

పెద్ద హీరోల సరసన నటించనని అనుకుంటున్నారు: తాప్సీ

పెద్ద హీరోల సరసన నటించాలనే ఒత్తిడి తనపై లేదని తాప్సీ అన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

నటిగా, నిర్మాతగా బిజీగా ఉన్నారు నటి తాప్సీ. తాజాగా దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె చిత్ర పరిశ్రమలో తనకు వచ్చే అవకాశాల గురించి మాట్లాడారు. తాను పెద్ద హీరోలతో పనిచేయను అని అందరూ అనుకుంటారన్నారు. 'ఇండస్ట్రీలో ఉన్న అగ్ర దర్శకనిర్మాతలు నేను పెద్ద హీరోల సినిమాల్లో నటించనని అనుకుంటారు. సవాళ్లతో కూడిన పాత్రలే నేను అంగీకరిస్తానని.. మిగతా వాటికి ఓకే చెప్పనని భావిస్తారు. అది వాస్తవం కాదు. అగ్ర హీరోల సినిమాల కథలు నా దగ్గరకు రావని నా మేనేజర్లు కూడా ఎప్పుడూ అడుగుతుంటారు. స్టార్ హీరోల సినిమాల్లో నటించాలనే ఒత్తిడి నాకేం లేదు. 'దంకీ' చేసినందుకు చాలా రిలాక్గా ఉన్నాను. అలాంటి సినిమాలే ఎక్కువ చేయాలనుకుంటున్నా. మంచి పాత్రలుంటే ఏ హీరో సినిమాలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నా. 'హసీన్ దిల్రుబా'లో పాత్ర నాకు ఆనందాన్నిచ్చింది. నిజ జీవితంలో నేను అలాగే ధైర్యంగా, తెలివిగా ఉంటాను' అని చెప్పారు. ప్రస్తుతం తాప్సీ 'గాంధారి'లో నటిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్గా ఇది ముస్తాబవుతోంది. ఈ చిత్రంలో ఆమె ఎలాంటి డూప్ లేకుండా సొంతంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం. కిడ్నాపయిన తన కూతురిని కాపాడుకునేందుకు ఓ తల్లి చేసే పోరాటం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. దీనిని దేవాశిశ్ మఖిజా తెరకెక్కిస్తున్నారు.

'కన్నప్ప' రిలీజ్ డేట్.. ప్రకటించిన మంచు విష్ణు

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ను విష్ణు ప్రకటించారు.

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ను విష్ణు ప్రకటించారు. వేసవి కానుకగా వచ్చే ఏడాది ఏప్రిల్ 25న దీనిని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. 'పరమేశ్వరుడి గొప్ప భక్తుడి కథ తెలుసుకునేందుకు సిద్ధం కండి' అని పేర్కొన్నారు. మహాకవి ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర మహత్యంలోని భక్త కన్నప్ప చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని 'కన్నప్ప' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మహాభారత' సిరీస్ని రూపొందించిన ముఖేష్కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్తో మోహన్ బాబు నిర్మిస్తున్నారు. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తుండగా.. ప్రభాస్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. మోహన్ బాబు, శరత్కుమార్, మధుబాల, ప్రీతి ముకుందన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విష్ణు తనయుడు అవ్రామ్ ఈ చిత్రంతో తెరంగేట్రం చేయనున్నారు. బాల తిన్నడుగా అతడు కనిపించనున్నాడు.

రిపబ్లిక్ సినిమా CINEMA

నేనేం స్వార్థపరుడిని కాదు.. రెమ్యూనరేషన్ పెంపు వార్తలపై స్పందించిన నటుడు

ఇటీవల విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సినిమాల్లో 'స్త్రీ 2' ఒకటి. ఈ చిత్రం మంచి కలెక్షన్లను వసూలు చేసి అగ్ర హీరోల సినిమాల రికార్డుల సరసన నిలిచింది. బాలీవుడ్ నటీనటులు శ్రద్ధాకపూర్, రాజ్ కుమార్ రావు ఇందులో జంటగా నటించి అలరించారు. ఈ సినిమా విడుదల తర్వాత రాజ్కుమార్ రెమ్యూనరేషన్ పెంచారనే వార్తలు నెట్టింట వైరల్గా మారాయి. తాజాగా వీటిపై ఆయన స్పందించారు. "ఒక్క సినిమాకు రూ.5 కోట్లు తీసుకుంటున్నానంటూ నాపై ఎన్నో ఆర్టికల్స్ రాస్తున్నారు. అవి అవాస్తవాలు. నా నిర్మాతలపై అంత భారం వేయడానికి నేనేం స్వార్థపరుడిని కాదు. రెమ్యూనరేషన్ అనేది నా నటనకు లభించిన బహుమానంగా భావిస్తాను. 'స్త్రీ 2' లాంటి బ్లాక్బస్టర్లో నేను భాగం కావడమే నా అదృష్టం. దాని విజయం నా స్వభావాన్ని మార్చదు. నేను జీవితమంతా పని చేయాలని కోరుకుంటున్నాను. అందుకే రెమ్యూనరేషన్ విషయంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోను. సవాళ్లతో కూడిన పాత్రలు ఎంచుకుంటూ ఎదగడానికి ఉపయోగపడే సినిమాలు చేస్తాను. నా దగ్గర రూ.100 కోట్లు ఉన్నాయని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. నాదగ్గర అంత డబ్బు లేదు" అని రాజ్ కుమార్ స్పష్టంచేశారు. 'స్త్రీ2' విజయం తర్వాత రాజ్ కుమార్ రెమ్యూనరేషన్ పెంచేశారని బాలీవుడ్లో కథనాలు వచ్చాయి. ఈ సినిమాకు కూడా రాజ్ కుమార్ రూ.6 కోట్లు, శ్రద్ధా కపూర్ రూ.5 కోట్లు తీసుకున్నట్లు రూమర్స్ వచ్చాయి. అమర్ కౌశిక్ దర్శకత్వంలో వచ్చిన 'స్త్రీ 2స. ఈ ఏడాది విడుదలైన పలు చిత్రాలతో పోటీపడి రికార్డులు సొంతం చేసుకుంది. బాక్సాఫీసు వద్ద రూ.874 కోట్లు వసూలు చేసింది. దీని మూడో భాగం పనులు కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయి. మూడో పార్ట్లో దీనికి మించిన ఎంటర్టైన్మెంట్ ఉంటుందని అందులో చాలా డెవలప్మెంట్లు చేశారని శ్రద్ధా కపూర్ చెప్పారు.

ఫ్యాషన్

రాత్రిళ్లు జీన్స్ ప్యాంట్ వేసుకుని ఈ తప్పు ఎట్టి పరిస్థితుల్లో చేయకండి.. అమ్మాయిలూ జాగ్రత్త..

ఫ్యాషన్ కోసం చాలా మంది అమ్మాయిలు చాలా టైట్గా ఉండే జీన్స్ ప్యాంట్లు ధరిస్తున్నారు. అయితే, ఇలా చేయడం చాలా డేంజర్ అంటున్నారు నిపుణులు. రాత్రిళ్లు జీన్స్ ప్యాంట్ వేసుకుని నిద్రపోవద్దంటున్నారు. అలా ఎందుకు అంటున్నారో ఇక్కడ తెలుసుకుందాం.



ప్రస్తుత తరంలో ఎక్కువ మంది వేసుకునే ట్రెండ్స్లో జీన్స్ ముందుంటుంది. మగ, ఆడ, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కూడా జీన్స్ ప్యాంట్ ధరిస్తారు. ప్రతి ఒక్కరి దగ్గర కనీసం ఒకటైనా జీన్స్ ప్యాంట్ ఉంటుంది. పురుషులే కాదు.. అమ్మాయిలు కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగా జీన్స్ దుస్తులు ధరిస్తున్నారు. ఈ రోజుల్లో సందర్భం ఏదైనా సరే జీన్స్ ప్యాంట్లకే ఓటు వేస్తున్నారు. ఫంక్షన్లు, ఏదైనా వర్క్ పని ఇలా ఏదైనా సరే జీన్స్ ప్యాంట్ వేసుకునే హాజరవుతున్నారు. అయితే, చాలా మందికి జీన్స్ ప్యాంట్లు వేసుకోవడం అసౌకర్యంగా ఉంటుంది. ఇంకొందరైతే.. రాత్రి వేళల్లో కూడా జీన్స్ ప్యాంట్లు వేసుకుంటారు. జీన్స్ వేసుకునే నిద్రపోతుంటారు. చాలా మంది జీన్స్ వేసుకుని నిద్రపోరు. కానీ, ఏదైనా శుభకార్యానికి బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు, రాత్రిళ్లు ప్రయాణ వేళల్లో జీన్స్ ప్యాంట్లు వేసుకుని నిద్రపోవాల్సి వస్తుంది. అయితే, రాత్రిళ్లు జీన్స్ ప్యాంట్లు వేసుకుని నిద్రించకూడదని నిపుణులు అంటున్నారు. ఇందువల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇంతకీ రాత్రిళ్లు జీన్స్ వేసుకుని నిద్రపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో ఇక్కడ తెలుసుకుందాం.

సరిగ్గా నిద్రపట్టదు..

రాత్రిళ్లు జీన్స్ వేసుకుని నిద్రపోవడం వల్ల సరైన కంఫర్ట్ ఉండదు. ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా? సాధారణంగా నిద్రలోకి జారుకున్న తర్వాత కొన్ని గంటలకు బాడీ టెంపరేచర్ తగ్గుతూ వస్తుంది. అయితే, మందపాటి జీన్స్ ధరించడం వల్ల గాలి ప్రసరణ సరిగ్గా జరగదు. దీంతో.. శరీరం ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో.. అసౌకర్యంగా ఉంటుంది. తర్వాత నిద్రకు భంగం కలుగుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే సుఖ నిద్ర కావాలంటే జీన్స్ దుస్తులు ధరించి నిద్రపోకూడదని నిపుణులు చెబుతున్నారు.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు..

జీన్స్ దుస్తులు మందపాటిగా, బిగుతుగా ఉంటాయి. ఇవి చెమటను పీల్చుకోలేవు. దీంతో.. ప్రైవేట్ పార్ట్ల దగ్గర చెమట అలానే ఉండిపోతుంది. ఇలా గంటల తరబడి చెమటతో వచ్చిన తేమ ఉండిపోవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. ఇది క్రమంగా లైంగిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. జీన్స్ దుస్తులు ధరించి నిద్రపోవడం వల్ల గాలి ప్రసరణ సరిగ్గా జరగదు. దీంతో.. చర్మంపై అలర్జీ, దద్దుర్లు, ఎరుపెక్కడం లాంటి సమస్యలు వస్తాయి. అందుకే రాత్రి వేళల్లో జీన్స్ దుస్తులు ధరించి నిద్రపోకూడదని నిపుణులు అంటున్నారు. అయితే, కాలంతో సంబంధం లేకుండా చెమట ఎక్కువ పట్టేవారు.. ఈ దుస్తులకు దూరంగా ఉండటమే మంచిది.

పీరియడ్స్ నొప్పులు..

పీరియడ్స్ సమయంలో మహిళలు జీన్స్ దుస్తులకు దూరంగా ఉంటేనే మంచిది. జీన్స్ వంటి బిగుతు దుస్తులు ధరించి నిద్రపోతే గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి వస్తుంది. దీంతో.. ఆ భాగాలకు రక్తప్రసరణ జరగదని నిపుణులు చెబుతున్నారు. పీరియడ్స్ సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇలా జరగడం వల్ల నెలసరి సమయంలో నొప్పి ఎక్కువగా ఉంటాయి. అందుకే వీటికి దూరంగా ఉండాలి. అంతేకాకుండా బిగుతైన జీన్స్ ప్యాంట్లు ధరించడం వల్ల నడుం నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదంటున్నారు నిపుణులు.

అమ్మాయిలు జాగ్రత్త..

ఫ్యాషన్ కోసం చాలా మంది అమ్మాయిలు చాలా టైట్గా ఉండే జీన్స్ ప్యాంట్లు ధరిస్తున్నారు. అయితే, ఇలా చేయడం చాలా డేంజర్ అంటున్నారు నిపుణులు. జీన్స్ చర్మాన్ని గట్టిగా పట్టేస్తుంది. దీంతో.. చర్మం, నరాలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. వీటికి రక్తప్రసరణ సరిగ్గా జరగదు. దీంతో.. ఆ ప్రాంతాల్లో వాపులు వచ్చే ప్రమాదముంది. అంతేకాకుండా నడుం వద్ద చాలా టైట్గా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. అజీర్తి, మలబద్ధకం సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరిలో సంతానలేమి సమస్యలు కూడా వస్తాయంటున్నారు. కాబట్టి.. అమ్మాయిలు జీన్స్ ప్యాంట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

సమయం ఏదైనా సరే లేదంటే నిద్ర పోయేటప్పుడైనా సాధ్యమైనంత వరకు వదులుగా ఉంటే దుస్తులకు ప్రాధాన్యం ఇవ్వండి. అందులోనూ కాటన్ జీన్స్కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే సరిపోతుంది. కాటన్ దుస్తులు మన శరీరం నుంచి వచ్చే చెమటను బయటకు పంపిస్తాయి. దీంతో చర్మ సమస్యలు రావు. పనిపై ఎవరి ఇంటికి, ఫంక్షన్లకు వెళ్లాల్సి వస్తే టైట్ జీన్స్ వేసుకోకుండా.. వదులుగా ఉండే వాటిని ధరించండి. అంతేకాకుండా రాత్రి వేళల్లో నైట్ వేర్కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే సరిపోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గమనిక..

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.